క్లుప్తంగా

దివ్యాంగులకు ట్యాబ్‌ల పంపిణీ



వలసపాకల భవిత కేంద్రంలో దివ్యాంగులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రామకృష్ణ

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల భవిత కేంద్రంలో దివ్యాంగులకు జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఎంఈఓ-2 ఏసుదాసు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఉపయోగపడేలా ట్యాబ్‌లను అందించి, ఒక అన్నలా ఆదుకుంటున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శి బీబీ, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం ప్రసాద్, సీఆర్పీ నాగలక్ష్మి, ఐఈడీఎస్ఎస్ టీచర్ సుందరి, ఐఈఆర్పీ టీచర్లు వరలక్ష్మి, వీరగణేష్, సూర్యకళ, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి నాయుడు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా క్రీడాకారిణికి అభినందనలు



లహరి దుర్గను అభినందిస్తున్న ఆర్జేడీ నాగమణి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన సాలిపేట మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ విద్యార్థిని లహరి దుర్గను ఆర్జేడీ, ఇన్‌చార్జి డీఈఓ నాగమణి శుక్రవారం కాకినాడలో అభినందించారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ యోగా పోటీలలో లహరి దుర్గ అండర్-14 విభాగంలో పాల్గొని ప్రతిభ చూపి ట్రెడిషనల్, ఆర్టిస్టిక్‌లో ద్వితీయస్థానాన్ని కైవశం చేసుకుంది. హెచ్‌ఎం జె.సుబ్బలక్ష్మి, పీఈటీ హెచ్‌వీఎల్ కుమారిలను ఆర్జేడీ అభినందించారు.

సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్లో ఈ నెల 18న కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో జరగనున్న ఇండస్ట్రీ 4.0 మార్కెటింగ్ ట్రెండ్స్ జాతీయ సదస్సు కర పత్రాలను ప్రిన్సిపాల్ ప్రశాంత శ్రీ ఆవిష్కరించారు. పీజీ సెంటర్ ఆవరణలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఓడీ అజయ్‌రత్నన్, అధ్యాపకులు రామరాజు, అనిల్ అంబిక, మధుకుమార్, మణికంఠేశ్వర్‌రెడ్డి, మనోజ్ దేవ, అప్పారావు, ఉమా రజిత తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌కు భారీ విరాళాలు

బోట్‌క్లబ్ : రోటరీ క్లబ్ కాకినాడ రీజియస్ తరఫున రోటరీ ఫౌండేషన్‌కు ఈ ఏడాది 20 వేల డాలర్లు అందజేయనున్నట్లు రీజినల్ చైర్మన్ ఎస్‌కే అహ్మద్ తెలిపారు. స్థానిక రోటరీ హాల్‌లో శుక్రవారం రోటరీక్లబ్ కాకినాడ సమావేశం అధ్యక్షులు గోపు కాశీవిశ్వనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ ఏడాది రీజియన్ తరఫున భారీ విరాళాలు సేకరించనున్నట్లు చెప్పారు. దీనిలో పాల్ హారిస్ ఫెలోషిప్‌కు విరాళాలు అందించిన 60 మంది క్లబ్ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఎల్.సత్యనారాయణ, బూల్‌చంద్ సదనాని, తడాల వరప్రసాద్, బాదం జయరామ్, చోడవరపు మూర్తి, గమిని కాశీలను క్లబ్ తరపున సత్కరించారు. అనంతరం అహ్మద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లుండి స్పందన రద్దు

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ఈనెల 13న కలెక్టరేట్‌లో జరగాల్సిన జగనన్నకు చెబుదాం-స్పందన రద్దు చేసినట్టు కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

అమ్మవారి హుండీల లెక్కింపు

బోట్‌క్లబ్: సంతచెరువు కనకదుర్గ అమ్మవారి హుండీలను శుక్రవారం లెక్కించారు. 35 రోజులకు రూ.1.6 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. హుండీల లెక్కింపులో దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, బాలత్రిపుర సుందరి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంచుకోవాలి

బాలాజీచెరువు: చదువుతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవాలని ఎంఎల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉండే ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఏడు ప్రాజెక్టుల విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ అమరేశ్వరరావు, బాలల సైన్స్ కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన పాఠశాలలు..
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఏలేశ్వరం, మదర్ థెరిసా ఉన్నత పాఠశాల కాకినాడ, శ్రీప్రకాష్ పెద్దాపురం, బదిరుల ఉన్నత పాఠశాల కాకినాడ, జెడ్పీ పాఠశాల కరప, చెందుర్తి ఎంపీ యూపీ స్కూల్, జిల్లా పరిషత్ ఉండూరు పాఠశాల.



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

సీఎం నమ్మకాన్ని పేదలు నిలబెట్టాలి

- చెప్పినవే కాదు చెప్పనవీ జగన్ చేశారు
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఇంద్రపాలెంలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'

కాకినాడ రూరల్: రాష్ట్రంలో పేదల పక్షాన నిలబడ్డ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టాలని, ఆయనకు అండగా నిలవాలని మాజీ మంత్రి కురసాల కన్నబాబు కోరారు. మండలంలోని ఇంద్రపాలెం గ్రామంలో సచివాలయం - 1 పరిధిలో శుక్రవారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'లో వివరించారు. తొలుత సచివాయం వద్ద అధికారులు డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ స్వప్న, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వీఆర్వో రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా మంజూరు చేసిన సుమారు రూ.16 కోట్లకు సంబంధించి డిస్‌ప్లేను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సచివాలయం-1 పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు లబ్ధిని ప్రజలకు అధికారులు తెలియజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కన్నబాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను సీఎం జగన్ సమర్థంగా అమలు చేశారని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నేరుగా వారి అకౌంటులో లబ్ధిని వేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో కాళ్లరిగేలా తిరిగినా పింఛన్లు అందని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వలంటీర్లు పింఛన్ అందిస్తున్నారన్నారు. ఎందుకు జగనే కావాలంటే ప్రతి ఒక్కరి గుండె తట్టి పథకాలు అందిన్నారన్నారు. పాఠశాలలను నాడు - నేడు పథకం ద్వారా ఆధునీకరించడంతో ఇంగ్లిషు మీడియం ప్రవేశ పెట్టారన్నారు. విద్యా వ్యవస్థలో సమూల పరీక్షలు చేశారన్నారు. పేదల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టరు, జగనన్న ఆరోగ్య శ్రీ వంటి కార్యక్రమాలు ద్వారా సేవలందిస్తున్నారన్నారు. నాలుగున్నరేళ్లలో 16 వైద్య కళాశాలలు, మహిళలు వైఎస్సార్ ఆసరా కింద నాలుగేళ్లుగా చెప్పిన విధంగా సొమ్ములు అందించి ఆదుకుంటున్నారు. జనవరి నుంచి పింఛన్లను రూ.3 వేలు ఇవ్వనున్నారన్నారు. పేదల పక్షాన నిలబడ్డ జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం గ్రామ నాయకులు ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, జేసీఎస్ మండల కన్వీనరు గీసాల శ్రీనివాసరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టరు అనుసూరి ప్రభాకర్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల శ్రీనివాసరావు, రాధా మనోహర్, సీతామహాలక్ష్మి, ప్రసన్న, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, తోటకూర శ్రీనివాస్ తదితరులతో కలసి ఇళ్లకు వెళ్లి ఏపీకి జగనే ఎందుకు కావాలో వివరించారు. ఎలిమెంటరీ స్కూల్ సెంటరు రామాలయం వద్ద సచివాలయ పరిధిలోని గ్రామస్తులతో కూర్చుని మాట్లాడి వారి నుంచి ప్రశ్నావళిని పూర్తి చేశారు.

అభివృద్ధి, సంక్షేమం జగన్‌తోనే

- బాబు, పవన్‌ల మాయ మాటలు నమ్మొద్దు
- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఎమ్మెల్యే ద్వారంపూడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఎన్నికల సమయంలో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్న మాజీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ల మాయమాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు సూచించారు. నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించేందుకు చేపట్టిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక 27వ డివిజన్ వడ్లపేట సచివాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో దాదాపు 33 ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజలకు అందించిన లబ్ధిని వివరించే సంక్షేమ ప్రచార బోర్డును ఎమ్మెల్యే ద్వారంపూడి ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ప్రజలకు దగ్గరగా ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థలను సీఎం జగన్ ఏర్పాటు చేశారన్నారు. విద్యా వ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకువచ్చి నాడు-నేడు పథకంలో పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఇదే అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగన్‌ను మరోసారి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం అప్పులపాలవుతోందని విమర్శిస్తూనే రాజకీయ లబ్ధి కోసం సీఎం జగన్‌కన్నా ఎక్కువ పథకాలు అమలు చేస్తామంటూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారని, అటువంటి వారిని నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బెండా విష్ణు, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, స్థానిక నాయకులు రాజాన సూర్యప్రకాష్, మన్యం బాబీ, వరిపల్లి కృష్ణవేణి, వరిపల్లి శివ, లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముందస్తు రబీతో సాగునీటి సమస్యకు చెక్

- మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వరరావు
- డిసెంబర్ నాటికి నాట్లు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వరరావు

కరప: రైతులు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రబీలో సాగునీటి సమస్యను అధిగమించి, మంచి దిగుబడులు సాధించాలంటే ముందస్తు సాగుచేపట్టాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోట వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళి అమావాస్య వెళ్లాక ఖరీఫ్ కోతలు ప్రారంభమవుతాయని, మాసూళ్లు పూర్తయిన వెంటనే డిసెంబరు నెలాఖరుకు రబీ నాట్లు పూర్తిచేసుకుని, మార్చి నెలాఖరుకు కోతలు పూర్తి చేసుకోవాలన్నారు. సాగునీటి ఎద్దడి లేకుండా అందరినీ సమన్వయం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆయన కోరారు. ఎంఏఓ ఏవీ రాజేష్ మాట్లాడుతూ సార్వాపంట ఆశాజనకంగా ఉందని, రైతు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందించేందుకు ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. పంటతెగుళ్ల నివారణకు రసాయనిక మందులు పిచికారీకి మండలానికొక డ్రోన్ అందుబాటులో ఉంచుతున్నామని, ఐదుగురు రైతులు ఒక గ్రూపుగా ఏర్పడితే రూ.12 లక్షలు విలువ చేసే డ్రోన్‌ను రూ.4 లక్షల రాయితో పొందవచ్చునన్నారు. పది నిమిషాల సమయంలోనే ఒక ఎకరా విస్తీర్ణంలో మందులు పిచికారీ చేయవచ్చన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు బొండా సూర్యనారాయణ, విజయరాయుడుపాలెం సర్పంచ్ వెలుబంటి వీర్రాఘవులు, కోఆప్షన్ సభ్యుడు షేక్‌దరియా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెకుముకి టాలెంట్ పరీక్ష



చెకుముకి టాలెంట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కరప: మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో జూనియర్ విభాగంలో 70 మంది, సీనియర్ విభాగంలో 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు, గణితం, సైన్స్‌లో అవగాహన కలిగించుకోవడానికి ఈ పరీక్ష ఉపయోగపడుతుందని ఉపాధ్యాయుడు వీవీ రమణమూర్తి తెలిపారు. ఈ పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించిన ప్రతీ తరగతి విద్యార్థిని ఎంపికచేసి, ఒక గ్రూపుగా మండల పరిధిలో నిర్వహించే చెకుముకి టాలెంట్ పరీక్షకు పంపిస్తామని హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ తెలిపారు.

దోషరహిత ఓటర్ల జాబితా లక్ష్యం

కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా దోషరహిత, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యమని నియోజక వర్గ ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు స్పష్టం చేశారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ-2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులు-పరిష్కారాలను వారికి వివరించారు. సుదీర్ఘ కాలంగా రాజీవ్ గృహకల్ప నివాసాల సముదాయాలన్నీ బ్లాకులుగా ఉన్నాయని, 254 బ్లాక్‌లు ఉండగా ప్రతీ 24 బ్లాక్‌లకు ఒకొక్క పోలింగ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు.

వివేకానంద పార్క్ అభివృద్ధికి కృషి
సందర్శకులకు మరింత సౌకర్యంగా ఉండేలా వివేకానంద పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు హామీ ఇచ్చారు. వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు కమిషనర్ శుక్రవారం పార్కును సందర్శించి సమస్యలను పరిశీలించారు. పార్కు ఆవరణలో శునకాల బెడద, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, వాకింగ్ ట్రాక్ సమస్యలను వాకర్లు కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ పార్కు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ సభ్యులు సైతం నామమాత్రపు సొమ్ముతో నిధిని సమకూర్చుకుని సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని సూచించారు. నవంబర్ నెలాఖరుకు ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పార్క్ ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న స్కేటింగ్ రింక్ నిర్మాణం పూర్తి కావస్తోందని, త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉందని చెప్పారు. వాకర్స్ అధ్యక్షుడు సిరి శ్రీనివాస్, కార్యదర్శి నేమాని సత్యనారాయణ, కోశాధికారి ఆంజనేయులు, సభ్యులు ఉన్నారు.



పార్కులో సమస్యలను పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

యూటీఎఫ్ రూరల్ మండల కార్యవర్గం ఎంపిక



యూటీఎఫ్ కాకినాడ రూరల్ మండల నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ: కాకినాడ యూటీఎఫ్ హోమ్‌లో రూరల్ అధ్యక్షులు ఎండీ తానేషా అధ్యక్షతన నూతన కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూటీఎఫ్ కార్యదర్శి టి.అన్నారాము, రాష్ట్ర పూర్వ కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, జిల్లా అధ్యక్షులు కేవీవీ నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవి చక్రవర్తి, యూటీఎఫ్ పూర్వ నాయకులు పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కె.సత్తిరాజు, తాళ్లరేవు ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు పాల్గొని మండల కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఆవాల హరి, అధ్యక్షుడిగా ఎండీ తనీషా, ప్రధాన కార్యదర్శిగా కేఎస్ రాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.ప్రసాద్ బాబు, సహాధ్యక్షుడిగా డీకే విశ్వేశ్వరి, కోశాధికారిగా జీవీ వరమణ, కార్యదర్శులుగా జీఎంఎల్ కనకదుర్గ, కె.అప్పారావు, పి.శ్యామలరావు, డి.లోవరాజు తదితరులు ఎంపికయ్యారు. వీరితో పాటు జిల్లా కౌన్సిలర్‌గా ఎస్.గోవిందరాజులు, పీజీ గోపాలరావు, ఎంవీవీ సత్యనారాయణ, బి భరణికుమార్, సీహెచ్ వేణు, పి.త్రిమూర్తులు, ఎస్‌వీ పద్మావతి, పి.మధుకుమార్, మీరునీసా బేగం తదితరులు ఎంపికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా అసోసియేట్ మహిళా అధ్యక్షురాలు బి.నాగమణి, అబ్జర్వర్‌గా ఎస్‌కే రహమాన్ బీ ఎన్నికలను పర్యవేక్షించారు. 50 ఏళ్ల స్వర్ణోత్సవ సంబరాలను 2024లో జరుపుకొనే సందర్భంగా ఇప్పటి నుంచే కార్యకర్తలు సన్నద్ధం కావాలని, అపరిష్కృత సమస్యలను సాధించుకోవడానికి ఐకమత్యంగా పోరాడాలని అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్ఠం చేసుకుని కాపాడుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు.

క్రాస్‌బౌ షూటింగ్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ప్రపంచ షూటింగ్ పోటీలలో విజేతలకు అభినందనలు



విజేతలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పట్టణంలో క్రాస్‌బౌ షూటింగ్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇటీవల ఆగ్రాలో జరిగిన ప్రపంచ క్రాస్‌బౌ షూటింగ్ పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులను స్థానిక జయ రెసిడెన్సీలో అభినందించారు. విజేతలతో పాటు ప్రోత్సహించిన తల్లిదండ్రులను, కోచ్ సాధిక్ ఖాన్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమానికి డాక్టర్ తేజ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే ద్వారంపూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వెంకట్‌నగర్‌లోని పెద్దిరెడ్డి పార్కులో క్రాస్‌బౌ రైఫిల్ షూటింగ్ అకాడమీకి అవసరమైన స్థలాన్ని కేటాయిస్తానన్నారు. జిల్లాకు చెందిన గాంధీ కార్తికేయ జూనియర్ స్టాండర్డ్ బౌ, నాకౌట్ కేటగిరిలో రెండు బంగారు పతకాలు, డి.వేద వీక్షిత్ అండర్-17 కేటగిరిలో జూనియర్ అసిస్టెంట్ కేటగిరీలో రెండు బంగారు పతకాలు, గాంధీ సత్యనారాయణ జూనియర్ కేటగిరీ, నాకౌట్‌లో రెండు రజత పతకాలు సాధించారు.

వెలుగుల పండగకు వేళాయె



మెక్లారిన్ గ్రౌండ్‌లో దీపావళి సామగ్రి దుకాణాలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి ప్రమిదలు

- బాణ సంచా విక్రయాలకు ఏర్పాట్లు
- నగరంలో 121 స్టాళ్లకు అనుమతులు

బోట్‌క్లబ్: దీపావళి అంటే ఇంటిల్లిపాది ఎంతో సంతోషంగా చేసుకొనే పండుగ. టపాసులు కాల్చడమంటే చిన్నారులకు ఎంతో సంబరం. సంతోషాల దీపావళిని ఆనందకర వాతావరణంలో జరుపుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పర్యావరణ హితంగా ఉన్న టపాసులు మాత్రమే కాల్చాలని అధికారులు కోరుతున్నారు. మరో వైపు దీపావళి సామగ్రి విక్రయించడానికి తాత్కాలిక స్టాళ్లు ఏర్పాట్లు చేశారు. నగరంలో స్థానిక మెక్లారిన్ హైస్కూల్, బోట్‌క్లబ్, డీసీఎంఎస్ గొడౌన్ వద్ద మొత్తం 121 తాత్కాలిక స్టాళ్లు ఏర్పాటు చేసుకొని దీపావళి సామగ్రి విక్రయిస్తున్నారు. అధికారులు శుక్రవారం నుంచి బాణసంచా విక్రయానికి అనుమతులు ఇవ్వడంతో గురువారం రాత్రి నుంచి ఆయా దుకాణాల్లో విక్రయాలకు సిద్ధం చేసుకున్నారు.

పుంజుకోని విక్రయాలు
దీపావళిని ఆదివారం జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. తాత్కాలిక స్టాళ్లలో శుక్రవారం నుంచి విక్రయించుకోవచ్చని అధికారులు ఆదేశాలు ఇచ్చినప్పటికి ప్రజలు వారం మంచిది కాకవపోవడంతో కొనుగోళ్లకు ఆసక్తి చూపలేదు. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్టాళ్లలో కొనేవారు లేక ఖాళీగా దర్శనమచ్చాయి. దీపావళి సామాన్లు కొనుగోలుకు సెంటిమెంట్ అడ్డు రావడంతో దుకాణాలు వెలవెలపోయాయి.

నిబంధనలు పాటించాల్సిందే
స్టాల్‌కు స్టాల్‌కు మధ్య 10 అడుగుల వ్యత్యాసం ఉండాలి. ప్రతి స్టాల్ ముందు బక్కెట్లతో ఇసుక, డ్రమ్ముల్లో నీరు ఉంచుకోవాలి. సక్రమమైన విద్యుత్ వైరింగ్ ఉండాలి. విద్యుత్, ఫైర్ అధికారులు అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. దుకాణాల ఏర్పాటుకు ఐరన్, సిమెంట్ షీట్లు మాత్రమే వాడాలి. దుకాణాల్లో చిన్న పిల్లలు ఉండకూడదు. అలా ఉంటే వారిపై కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదం జరిగితే వినియోగదారులు, దుకాణాల్లో పనిచేసేవారు తప్పించుకునేందుకు రెండు దారులు ఉండాలి.

భద్రతా చర్యల పరిశీలన



దీపావళి షాపుల వద్ద భద్రతా చర్యలను పరిశీలిస్తున్న ఆర్డీవో కిశోర్

కాకినాడ సిటీ: దీపావళి పండుగ నేపథ్యంలో కాకినాడ మెక్లారిన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా విక్రయ దుకాణాలను శుక్రవారం ఆర్డీవో ఈ.కిశోర్ రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలసి పరిశీలించారు. దుకాణదారులు కచ్చితంగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, ముఖ్యంగా నీరు, ఇసుక, అగ్నిమాపక నిరోధక చర్యలు చేపట్టాలని నిర్ణీత వేళల్లో మాత్రమే విక్రయాలు సాగించాలని కోరారు. దుకాణాల వద్ద రద్దీ లేకుండా చూడాలని పోలీసు వారిని ఆదేశించారు. అలాగే ఏర్పాటు చేసిన అగ్నిమాపక యంత్రాలను పరిశీలించారు. కొనుగోలుదారులు నిర్దేశించిన ప్రాంతంలో మాత్రమే వాహనాలు పార్క్ చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఆర్డీవో వెంట అగ్నిమాపకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డీవీ సుబ్బారావు, తహసీల్దార్ పి.సీతాపతిరావు, త్రీ టౌన్ సీఐ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ 46వ డివిజన్ పరిధిలోని ఎల్బీనగర్‌కు చెందిన పేదలకు పండూరు-1 లే అవుట్‌లో ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పంపిణీ చేశారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 16 మంది మహిళలకు పట్టాలు అందించగా వారు హర్షం వ్యక్తం చేశారు. కన్నబాబు మాట్లాడుతూ ఎల్బీనగర్‌లో పేదలకు వారి విజ్ఞప్తి మేరకే నేమాంలో కేటాయించిన పట్టాలకు బదులుగా పండూరులో ఇచ్చామన్నారు. కార్యక్రమంలో టీపీఆర్వో కృష్ణమోహన్, కాకినాడ రూరల్ మండల జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గోపుశెట్టి బాబ్జీ, మోకా కృష్ణంరాజు, రేపూరు సర్పంచ్ నక్కా వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ కోర్సులతో ఉపాధి అవకాశాలు

కరప: పదో తరగతి పూర్తయిన తర్వాత స్వయం ఉపాధి పొందాలన్నా, పదిమందికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నా మేనేజ్‌మెంట్ కోర్సులు ఉపయోగపడతాయని హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ అన్నారు. మండలం గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ఆయన అవగాహన కల్పించారు. కెరీర్ గైడెన్స్ ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నతశిఖరాలు అధిరోహించడానికి ఎంబీఏ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ వ్యాపారాలు, స్టార్టప్ కంపెనీలు, ఆన్‌లైన్ మార్కెటింగ్, సేల్స్ అండ్ సర్వీస్, కస్టమర్ కేర్ వంటివి విస్తరిస్తున్న తరుణంలో ఈ కోర్సుల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు వీవీ రమణమూర్తి, ఎ.సూర్యనారాయణ, టి.వేణుగోపాల్ తదితరులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

రామ పాదుకలను దర్శించుకున్న పరిపూర్ణానంద స్వామిజీ

కాకినాడ రూరల్: అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠించేందుకు తెనాలికి చెందిన భక్తుడు చల్లా శ్రీనివాసశర్మ తయారు చేయించిన పాదుకలు శుక్రవారం రమణయ్యపేటలో శ్రీపీఠం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆ పాదకలను పరిపూర్ణానంద స్వామిజీ, భక్తులు దర్శించుకున్నారు. ఈనెల 14 నుంచి శ్రీపీఠంలో మహాశక్తి యాగం ప్రారంభమవుతున్నందున పాదుకలు రావడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

తడి, పొడి చెత్త విడిగా సేకరించాలి

కరప: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించేటప్పుడు తడి, పొడి చెత్త విడి విడిగా సేకరించి, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించాలని మండల ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. కరప, గురజనాపల్లి, నడకుదురు తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి గ్రామ కార్యదర్శులకు ఆయన పారిశుద్ధ్య పనుల నిర్వహణపై పలు సూచనలిచ్చారు. నిత్యం పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించి, వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైన్లలో పూడికతీయించాలని అన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటింటికీ వెళ్లి నీరునిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, శుభ్రం చేయించాలని, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయించాలని ఈఓపీఆర్డీ సూచించారు. కార్యదర్శులు ఎస్‌కే నాగేంద్రకుమార్, పీఏస్ఆర్ బ్రహ్మానందం, ఏఎన్ఎం సాదే ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.